క్లుప్తంగా

వరుణ దేవా కరుణించు



అమరచింత: వర్షాలు సకాలంలో కురిసి పంట పొలాలతో పాటు వాగులు, వంకలు పారాలంటూ పవిత్ర నదీ జలాలను తీసుకొచ్చి శనివారం నాగల్‌కడ్మూర్‌లో ఆంజనేయ, శివాలయంలో అభిషేకాలు నిర్వహించారు. మృగశిర కార్తె పూర్తి కావస్తున్నా ఇంకా రుతుపవనాలు జాడే కనిపించట్లేదని వాపోయారు. ఇప్పటికీ ఉష్ణతాపం తగ్గకపోవడంతో పొలాల్లో విత్తిన జొన్న, పత్తి, ఇతర విత్తనాలు పాడవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారురు. గ్రామంలోని దేవతామూర్తులకు పవిత్ర కృష్ణా జలంతో అభిషేకించి పూజలు నిర్వహించాలని భావించిన నాగల్‌కడ్మూర్ గ్రామస్తులు మేళతాళాలతో కృష్ణానదికి ప్రత్యేక పూజలు చేశారు. ఎడ్ల బండ్లపై జల్దీ బిందెలతో పవిత్ర నదీ జలాలను తీసుకొచ్చి అభిషేకం నిర్వహించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి సిరుల పంట పండాలని వేడుకున్నారు.

నీట్ ర్యాంకర్‌కు సన్మానం



అడ్డాకుల: మండలంలోని పొన్నకల్ గ్రామానికి చెందిన రవీంద్రనాథ్ కుమార్తె కాదాంబరి నీట్‌లో ఆలిండియా ర్యాంకు సాధించడంతో శనివారం ప్రజాప్రతినిధులు సత్కరించారు. నీట్‌లో 720 మార్కులకు గాను 695 మార్కులు సాధించి ఆలిండియా స్థాయిలో 495వ ర్యాంకు పొందిన నేపథ్యంలో విద్యార్థినిని అభినందించారు. ఆమె నివాసంలో ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి శాలువాతో సత్కరించి మిఠాయి తినిపించారు. ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ కోఆప్షన్ మెంబర్ మహిమూద్, సూపరింటెండెంట్ శివప్రసాద్, విజయకుమార్‌రెడ్డి, రమేష్, జైపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



దేవరకద్ర రూరల్: ప్రజలందరూ సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీఐ రజిత రెడ్డి అన్నారు. శనివారం బల్సుపల్లిలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇంటర్నెట్‌ను పరిమితికి మించి వాడకూడదని, ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు నడిపేవారు కొత్త వ్యక్తుల మాటలను నమ్మరాదని, తెలియని మెసెజ్‌లపై క్లిక్ చేయరాదని తెలిపారు. కార్డెన్‌సెర్చ్‌లో సరైన పత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలను గుర్తించారు. కార్యక్రమంలో 5 గురు ఎస్‌ఐలు, 25 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

పెద్దకొత్తపల్లి: మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేవైఎం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంతోపాటు దేవల్‌తిరుమలాపూర్, వెన్నచర్ల, నక్కలపల్లి, ఆదిరాలలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. మండల అధ్యక్షుడు మల్లేష్ మాట్లాడుతూ దేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పరిపాలన 9ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేద ప్రజలకు వివరించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో భరత్‌చంద్ర, జలాల్ శివుడు, భీమేష్, రాజు, ప్రవీన్, తిరుమల్, సుధాకర్‌రావు, మార్కండేయ, జగదీష్, శివ, విష్ణు, కిరణ్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ శవం గుర్తింపు

వనపర్తి: మండలంలోని పెద్దగూడెం శివారు అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని మహిళ శవాన్ని గుర్తించిన గొర్రెల కాపర్లు ఇచ్చిన సమాచారం, వీఆర్‌ఏ బాలకృష్ణ ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ నాగన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వారం రోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చని ఎస్‌ఐ తెలిపారు. శవాన్ని మార్చురీకి తరలించి పంచనామా నిర్వహించనున్నారు.

ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీ

వనపర్తి: ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటన శనివారం రాత్రి జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్ సమీపంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనలో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరుకు చెందిన ఆశమ్మ, రాములు బుగ్గపల్లితండా వద్ద నిర్మాణం చేస్తున్న మిషన్ భగీరథ పథకం పనులు చేసేందుకు వచ్చారు. అనారోగ్యానికి గురైన శ్యామలను ఆస్పత్రికి చూపించి ఎంసీహెచ్ నుంచి తిరిగి పని ప్రదేశానికి వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ మేరకు కేసు నమోదైంది.

గిరిజనుల అభ్యున్నతికి కృషి

- సంప్రదాయ వేషధారణలో మహిళలు
- దశాబ్ది వేడుకలకు హాజరైన అధికారులు



చీకురుచెట్టుతండాలో గిరిజనులతో ఎంపీడీఓ అఫ్జల్

అమరచింత: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని చంద్రనాయక్‌తండా పంచాయతీ పరిధిలో గిరిజన ఉత్సవాలను అధికారులు ఘనంగా ప్రారంభించారు. సంత్‌సేవాలాల్ చిత్రపటానికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తండాలోని గిరిజన మహిళలు తమ సాంప్రదాయ దుస్తులతో సంబురాల్లో పాల్గొని నృత్యాలు చేశారు. ఈమేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ గిరిజన తండాల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలను తీసుకొచ్చారన్నారు. సీఎం గిరివికాస్ పథకంతో బీడు భూముల్లో సాగు నీరు పారించే కార్యక్రమంతో గిరిజనులు వ్యవసాయ పనుల్లో బీజీగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శిల్పాశంకర్ నాయక్, ఉప సర్పంచ్ తులసీ, తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ జ్యోతి, జెడ్పీటీసీ మార్క సరోజ, ఎంపీటీసీ శకుంతల, ఎంపీఓ నరసింహులు, ఏపీఓ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం పెద్దమందడి మండలంలోని ముందరితండా, అనకాయిపల్లితండా, చీకురుచెట్టుతండా, స్కూల్‌తండా, బుగ్గపల్లితండా గ్రామ పంచాయతీల్లో గిరిజనులు గిరిజన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. తండాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ఎంపీడీఓ అఫ్జల్, ప్రత్యేక అధికారులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గిరిజనులతో కలిసి సేవాలాల్ మహారాజ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. గిరిజన మహిళలు సాంప్రదాయ దుస్తువులు ధరించి ఆటపాటలతో సరదాగా గడిపారు. అనంతరం తండాల్లోని వృద్ధ గిరిజనులను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రాధాకృష్ణ, జయంతి, ఉప సర్పంచ్ రమేష్‌నాయక్, సజనమ్మ, పాత్లవత్ లక్ష్మి, అనిత తదితరులు ఉన్నారు.



హీర్లతండాలో పూజలు చేస్తున్న గిరిజనులు

గోపాల్‌పేట: స్వరాష్ట్రం పాలనలో గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఎంపీపీ సంధ్య అన్నారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం గిరిజన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలికెపాడు తండాల్లో గిరిజనులను ఉద్దేశించి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, వారిని సన్మానించారు. అనంతరం సాంప్రదాయ కార్యక్రమాల్లో పాల్గొని వారిని ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు భార్గవి, తిరుపతి యాదవ్, కోటిరెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రేవల్లి మండలంలో..

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రేవల్లి మండలంలోని పలుతండాల్లో గిరిజనుల దినోత్సవాన్ని ఎంపీపీ సేనాపతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

గిరిజన తండాల్లో పండుగ వాతావరణం

వనపర్తి: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం గిరిజన దినోత్సవాన్ని నిర్వహించారు. ఖిల్లాఘనపురం మండలంలోని తండాల్లో ఉదయం నుంచి గిరిజనులు చిన్నా, పెద్ద తారతమ్యం లేకుండా సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ విజయ్‌కుమార్, తహసీల్దార్ పరమేశ్వర్, ఎంపీఓ రాజు తదితరులు పాల్గొన్నారు.



పాలికెపాడు తండాలో గిరిజనులను సన్మానిస్తున్న ఎంపీపీ సంధ్య



సంత్‌సేవాలాల్ చిత్రపటానికి పూజలు చేస్తున్న తహసీల్దార్ చాంద్‌పాషా



చంద్రనాయక్‌తండాలో నృత్యాలు చేస్తున్న గిరిజన మహిళలు

తండాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి

పాన్‌గల్: గిరిజన తండాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని కిష్టాపూర్‌తండా, అన్నారంతండాలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రూ.20 లక్షలతో నిర్మించే జీపీ భవనాలకు సర్పంచ్‌లతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు తర్వాత తండాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యత ఇస్తూ నిధులు కేటాయిస్తున్నారని కొనియాడారు. ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పడిన తండాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జీపీ భవనాలను నిబంధనల మేరకు నాణ్యతగా నిర్మించాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ దామోదర్‌రెడ్డి, సర్పంచ్‌లు దేవీసింగ్, రంగానాయక్, మండల ప్రత్యేకాధికారి సురేష్‌కుమార్, తహసీల్దార్ చక్రపాణి, బీఆర్‌ఎస్ నాయకులు చంద్రశేఖర్‌నాయక్, రఘుపతినాయుడు, యాదగిరిచారి, నిరంజన్‌యాదవ్ పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే సంక్షేమ పథకాల అమలు



ర్యాలీ చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్

కొత్తకోట: రాష్ట్రం ఏర్పడిన తర్వాత గిరిజనులు ఆత్మగౌరవంతో జీవించే విధంగా పలు సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ తీసుకొచ్చారని జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. దశాబబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని విలియంకొండ తండాలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈమేరకు సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. నియోజక వర్గంలో సీఎం కేసీఆర్ సహకారంతో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కృషితో తండాలకు ప్రత్యేక నిధులు సమకూర్చి అభివృద్ధి చేసుకుంటున్నారని వెల్లడించారు. మండలంలోని తండాలకు బీటీ రోడ్లు, గ్రామ పంచాయతీలకు భవనాలు, సీసీ రహదారులు మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యేకు దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుంతమౌనిక, మండల రైతు సమితి అధ్యక్షుడు కొండారెడ్డి, గాడీల ప్రశాంత్, ఆకుల శ్రీనివాసులు, గుంత మల్లేష్, కటిక శ్రీను, విలియంకొండ తండా సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: స్థానిక మున్సిపల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన పట్టణంలో పర్యటించారు. ఎన్‌టీఆర్ చౌరస్తా, జగ్జీవన్‌రాం చౌరస్తాతో పాటు ప్రధాన కూడళ్లలో జంక్షన్‌లను పరిశీలించారు. నిర్మాణ పనులు నాణ్యతగా చేయాలని సూచించారు. రోడ్డు విస్తరణతో పాటు పార్కుల సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ బోజ్యానాయక్, చంద్రశేఖరాచారి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, గాలియాదవ్ తదితరులు ఉన్నారు.

పెద్దకొత్తపల్లి: పేద ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నిధులు మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సాతాపూర్ చెందిన కోళ్ల కన్నయ్యకు రూ.23వేల చెక్కును అందజేశారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించాలి



ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

వనపర్తి టౌన్: జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య అందించాలని టీయూడబ్ల్యూజేహెచ్ 143 జిల్లా అధ్యక్షుడు పోతుల రాము కోరారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో ఏడీ నరహరికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఇన్‌చార్జ్ డీఈఓ గోవిందరాజులుతో జర్నలిస్టులు ఫోన్‌లో మాట్లాడారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన గోవిందరాజులు జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యనందించే విధంగా ఆదేశిస్తూ ప్రైవేట్ స్కూళ్లకు సర్క్యూలర్ జారీ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీవీడబ్ల్యూజే ఫెడరేషన్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, మహబూబ్‌బాషా, సుంకరి రమేష్, గోవర్ధన్, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణంలో రాళ్ల కుప్పలు



పాంరెడ్డిపల్లి క్రీడా ప్రాంగణంలో వేసిన రాళ్లు

అమరచింత: మండలంలోని పాంరెడ్డిపల్లి క్రీడా ప్రాంగణంలో రాళ్ల కుప్పలు ఉండటంతో ఆటలు ఆడుకోవడానికి వీలులేకుండా పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని యువత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణానికి మంజూరైన క్రీడాప్రాంగణం గ్రామ శివారులోని కేజీబీవీ పాఠశాల సమీపంలో నిర్మించారు. పాఠశాల విద్యార్థినులకు ఉపయోగపడుతుందని భావించారు. కానీ వేసవి సెలవుల్లో సమీపంలోని పొలం పనులు చేసుకుంటున్న రైతులు క్రీడాప్రాంగణంలో మిర్చిని ఆరబెట్టుకోవడానికి కవర్లను కప్పారు. కవర్లు ఎగిరిపోకుండా రాళ్లు పెట్టారు. మిర్చిని తీసుకెళ్లిన రైతులు రాళ్లను మాత్రం క్రీడా ప్రాంగణంలో అలాగే వదిలి వెళ్లారు. దీంతో క్రీడా ప్రాంగణం అంతా రాళ్లతో నిండిపోయింది. అధికారులు స్పందించి క్రీడాప్రాంగణాన్ని శుభ్రపర్చాలని విద్యార్థినులు కోరుతున్నారు.

సామాజిక సేవల్లో ప్రతిఒక్కరూ పాల్గొనాలి

అమరచింత: సామాజిక సేవల్లో యువకులు పాల్గొని ప్రజలకు సేవ చేయాల్సిన అవసరం ఉందని రెడ్‌క్రాస్ జిల్లా ఉపాధ్యక్షుడు కలాంపాషా అన్నారు. మండల కేంద్రంలో దేశాయి ప్రకాష్‌రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో విలేకరులతో కలిసి ప్రజలకు తాగునీటిని అందిచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడుతున్న ప్రెస్ క్లబ్ సభ్యులు చలివేంద్రంలో పాల్గొని ప్రజలకు సేవలు అందించడం అభినందనీయం అన్నారు. పట్టణంలో వేసవి ప్రారంభం నుంచి యూనియన్ బ్యాంక్ సమీపంలో దేశాయి ప్రకాష్ రెడ్డి సేవా సమితి చలివేంద్రాన్ని నిర్వహిస్తూ ప్రజల దాహార్తిని తీరుస్తున్నారని తెలిపారు. రామన్‌గౌడ్, ఖాజా పాల్గొన్నారు.

గ్యాస్ లీకేజీతో చెలరేగిన మంటలు

వనపర్తి: వంటగ్యాస్ సిలిండర్ మార్చుతుండగా.. రెగ్యులేటర్ ఒత్తిడికి పిన్ లోపలికి వెళ్లటంతో గ్యాస్ లీక్ అయి ఇంట్లో మంటలు చెలరేగిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. అగ్నిమాపకశాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం జిల్లా కేంద్రంలోని బండారునగర్ కాలనీలోని రాజేష్‌గౌడ్ ఇంట్లో కొత్త సిలిండర్ స్టౌకు బిగిస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుందన్నారు. అప్పటికే ఇంట్లో దీపం వెలుగుతుండటంతో లీకేజీ అయిన గ్యాస్‌తో మంటలు వచ్చాయి. ఈ ఘటనలో ఇంటి తలుపులు విరిగిపోవటం, డోర్ కర్టన్లు కాలిపోయాయి. ఇంట్లో వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలిపారు. ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలను సేకరించామన్నారు.

మరోసారి ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



భూత్పూర్ పట్టణంలో తెలంగాణ వంటకాలను రుచిచూస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్: రాబోయే ఎన్నికల్లో తమ పార్టీని మరోసారి ఆశీర్వదించాలని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. భూత్పూర్ మున్సిపాలిటీలో దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొని, అందులో భాగంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్వయంగా తయారు చేసిన తెలంగాణ వంటకాలను శనివారం ఆయన రుచిచూశారు. సీఎం కేసీఆర్‌తో తె లంగాణ రాష్ట్రంతో పాటు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సాధ్యమైందని, సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని అన్నారు. అనంతరం కొర్లవంపు తండా నుంచి కర్వెన వరకు రూ.90 లక్షల వ్యయంతో చేపట్టిన బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. అదేవిధంగా భూత్పూర్ మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న గడ్డ భారతమ్మ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న సందర్భంగా ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అవార్డును ఎమ్మెల్యే ఆల, చైర్మన్ బస్వరాజ్ గౌడ్, కమీషనర్ నజీబ్, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డికి ఆమె చూపించారు. మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు, పట్టణ ప్రజలు ఆమెను అభినందించారు. వైస్ ఎంపీపీ నరేష్ గౌడ్, విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి, ముడా డైరెక్టర్లు చంద్రశేఖర్ గౌడ్, సాయిలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పూర్తి చేయండి

కొల్లాపూర్ రూరల్: నియోజకర్గంలో ఉన్న ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, డబుల్ ఓటర్లను గుర్తించి జాబితా ప్రక్రియను ఎన్నికల సమయం నాటికి పూర్తి చేయాలని బూత్ లెవల్ ఎన్నికల అధికారులను ఆర్డీఓ హనుమానాయక్ ఆదేశించారు. శనివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి బూత్ లెవల్ ఎన్నికల అధికారులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ బోజ్యానాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్ నాయక్, తహసీల్దార్ శ్రీనివాసులు ఉన్నారు.

నిందితులను వెంటనే అరెస్టు చేయాలి



వనపర్తి: స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్న వారిపై అకారణంగా దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. శనివారం జీజీహెచ్ ఎదుట కాంట్రాక్టు ఉద్యోగులు నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ప్రభుత్వ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గురువారం రాత్రి మద్యం సేవించి విధుల్లో ఉన్న ఆస్పత్రి సెక్యూరిటీ గార్డులు అనిల్ రాజు, నరేందర్‌పై విచక్షణ రహితంగా దాడి చేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సెక్యూరిటీ కార్మికులు రాజేష్, కళ్యాణ్, శ్రీకాంత్, వెంకటయ్య, ఆనంద్, అనిల్, నరేందర్, రవి, శాంతమ్మ, ప్రేమకుమారి తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

వనపర్తి: ఈనెల 15వ తేదీన పని కోసం పట్టణానికి వచ్చిన తమ కూతురు తప్పిపోయిందని మండలంలోని చందాపూర్ గ్రామానికి చెందిన శ్యామల, రాములు దంపతులు టౌన్ ఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు. ఇంటర్ వరకు చదువుకున్న అమ్మాయి తమతో పాటు పనికి వచ్చేదని తెలిపారు. అదే విధంగా 15వ తేదీన పని కోసం తమ వెంటే వనపర్తిలో ప్రజావైద్యశాల రోడ్డు వరకు వచ్చి వెనక నుంచి వెనకనే కనపడకుండా పోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

సత్తాచాటిన ‘ప్రభుత్వ’ విద్యార్థులు

- అత్యధికంగా సీట్లు సాధించిన కేతేపల్లి ప్రాథమిక పాఠశాల
- ఈ ఏడాది గురుకులానికి 11మంది ఎంపిక
- మండలంలో వివిధ పాఠశాలల నుంచి 72 మంది..



గురుకులకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పాన్‌గల్: ఆంగ్ల మాధ్యమం మోజులో పడి ప్రైవేటు పాఠశాలల వైపు ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రుల్లో మార్పులు తెచ్చేందుకు మండలంలోని కేతేపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నడుం బిగించారు. వారికి గ్రామస్తులు సహకారం అందించారు. దీంతో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఇక్కడి విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారు. విద్యా సంవత్సరం మొదటి నుంచే పక్కా ప్రణాళికతో విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ప్రత్యేక తరగతుల నిర్వహణతో ఆంగ్ల బోధనపై ఉపాధ్యాయులు దృష్టి పెట్టారు. ఫలితంగా ఇక్కడి విద్యార్థులు గురుకులాల ప్రవేశ పరీక్షలకు హాజరై ఎక్కువ సంఖ్యలో సీట్లు సాధిస్తున్నారు.

మండలంలో ఉత్తమ ప్రతిభ

కేతేపల్లి ప్రాథమిక పాఠశాలల్లో 83మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. నాలుగో తరగతి విద్యార్థులు 14మంది ఉన్నారు. 2022–23 విద్యా సంవత్సరానికి గురుకులాల్లో ఐదో తరగతిలో చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 14 మంది హాజరుకాగా మొదటి విడతలో 11మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ పాఠశాల విద్యార్థులు ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తూ మండలంలో ఆదర్శంగా నిలుస్తున్నారు.

కార్పొరేటుకు దీటుగా..

మనఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి కార్పొరేటు పాఠశాలలకు దీటుగా వసతులు సమకూరుస్తున్నారు. అంతేకాకుండా మండలం నుంచి వివిధ పాఠశాలల నుంచి గురుకులాలకు 72మంది ఎంపికైనట్లు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. కేతేపల్లి కాంప్లెక్స్ పరిధిలో 33 మంది, పాన్‌గల్ కాంప్లెక్స్ పరిధిలో 25 మంది, మాందాపూర్ కాంప్లెక్స్ పరిధిలో 14 మంది విద్యార్థులు ఉన్నారు.


సమష్టి కృషితోనే..



ఉపాధ్యాయుల సమష్టి కృషితో ఈ సంవత్సరం విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. మూడేళ్లుగా గురుకుల పాఠశాలకు ఎంపిక అయ్యే విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి ప్రైవేటు పాఠశాలకు దీటుగా విద్యా బోధన అందుతుండటంతో ప్రభుత్వ పాఠశాలపై తల్లిదండ్రులకు నమ్మకం పెరిగింది.

– శివకుమార్, హెచ్‌ఎం

తల్లిదండ్రులకు పెరిగిన విశ్వాసం



ప్రతి ఏడాది మా పాఠశాల నుంచి గురుకులకు ఎంపిక అవుతున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతుండటంతో ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం పెరిగింది. రూ.వేలు ఖర్చు చేసి ప్రైవేట్‌కు పంపుతున్న తల్లిదండ్రులు ఫలితాలను చూసి ప్రభుత్వ పాఠశాల వైపు ఆసక్తి చూపుతున్నారు.

– గోపాల్‌నాయక్, ఉపాధ్యాయులు

మరింత బలోపేతం



ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం పెరిగి అవి మరింత బలోపేతం అవుతాయి. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన సాగుతుంది. దీంతో పాటు ఈ ఏడాది గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్షలలో మండలం నుంచి 72 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. ఇదే స్ఫూర్తితో ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది.

– లక్ష్మణ్‌నాయక్, ఎంఈఓ, పాన్‌గల్

పోస్టర్ల ఆవిష్కరణ

కొల్లాపూర్: రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ పోస్టర్లను శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టణంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ క్విజ్ పోటీలలో పాల్గొనే వారు జూలై 2వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ పూర్తిగా తెలంగాణలోని యువశక్తిని మేలుకొలిపేందుకు ఈ పోటీ ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు. కార్యక్రమంలో జగదీశ్వర్‌రావు, అశోక్‌గౌడ్, రాము యాదవ్, కాంతారావు తదితరులు ఉన్నారు.

